# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం | 03 ఆగస్టు, 2026 | పేజీలు : 06


## అర్హుల కళ్లలో 'చేయూత' ఆశలు!


వివరాలు మెయిన్‌లో...

## ఇందిరమ్మ చివరి బిల్లు ఎప్పుడో?



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎదురుచూపులు

**ప్రజాపక్షం/నిర్మల్ :** సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు ఉత్సాహంగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు చివరి విడత బిల్లు చెల్లింపుల ప్రక్రియ తీవ్ర నిరాశను మిగులుస్తోంది.ప్రాథమిక దశలైన బేస్‌మెంట్, రూఫ్, స్లాబ్ లెవల్ వరకు క్రమపద్ధతిలోనే బిల్లులు మంజూరైనప్పటికీ,చివరి (నాలుగో) విడత బిల్లు మంజూరు కావడంలో జరుగుతున్న ఆలస్యం వల్ల పేదలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులు ఇళ్లల్లోకి గృహప్రవేశాలు చేయడానికి సిద్ధమవుతున్నప్పటికీ, ప్రభుత్వం నుంచి రావాల్సిన చివరి బిల్లు నిలిచిపోవడంతో వేలాది కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రక్రియ వివిధ దశల్లో సాగుతోందని హౌసింగ్ అధికారులు వెల్లడించారు.

జిల్లాలో ఇప్పటికే 2,493 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా, మిగిలిన నిర్మాణాలు కూడా వేగంగా కొనసాగుతున్నాయి. అయితే నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు సంబంధించి నాలుగో విడత బిల్లులు ఇంకా క్లియర్ కాకపోవడమే ప్రస్తుతం లబ్ధిదారులకు పెద్ద సమస్యగా మారింది.

చాలామంది లబ్ధిదారులు ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయాన్ని నమ్ముకొని, బయట ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చి నిర్మాణాలు పూర్తి చేశారు. గడువు ప్రకారం బిల్లులు వస్తే ఆ అప్పులు తీర్చుకోవచ్చని భావించినప్పటికీ, చివరి విడత డబ్బులు ఖాతాల్లో పడకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కొండలా పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా వడ్డీలు చెల్లించలేక, ఇటు ఇంటి నిర్మాణం పూర్తి చేసినా హాయిగా ఉండలేక లబ్ధిదారులు మానసిక వేదనకు గురవుతున్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి :** ప్రస్తుతం నాలుగో బిల్లుకు సంబంధించి కేవలం నిర్మల్ జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.20 లక్షల బిల్లుల విడుదల ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం త్వరితగతిన నిధులు విడుదల చేసి తమను ఆదుకోవాలని, చివరి బిల్లు పడితేనే అప్పుల బాధల నుంచి గట్టెక్కుతామని లబ్ధిదారులు కోరుతున్నారు.

**ఆందోళన వద్దు, త్వరలోనే బిల్లుల జమ :** లబ్ధిదారులు బిల్లుల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. క్షేత్ర స్థాయి పరిశీలన ముగిసి, డిఈ మరియు కలెక్టర్ అనుమతి పొందిన బిల్లుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. రాష్ట్ర స్థాయి నుంచి వరుస క్రమంలో నిధులు విడుదల కాగానే నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయి.– పిడి , జిల్లా హౌసింగ్ శాఖ, నిర్మల్.

## ఎడపల్లి రైతు వేదికను కమ్మేసిన కోనోకార్పస్ వృక్షాలు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక భవనం దట్టమైన చెట్ల చాటున మరుగున పడిపోతుంది. భవనం ప్రాంగణంలో నాటిన కోనోకార్పస్ చెట్లు ఏపుగా పెరిగిపోవడంతో అసలు ఇక్కడ రైతు వేదిక ఉందనే విషయమే తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ కోనోకార్పస్ చెట్లు మరింత దట్టంగా పెరిగి, కొమ్మలు నలువైపులా విస్తరించాయి. దీని వల్ల దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులకు దగ్గరకు వచ్చే వరకు భవనం కనిపించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. భవనం ముందు భాగమంతా ఆక్రమించిన ఈ చెట్ల వల్ల అసలు ఇది ప్రభుత్వ కార్యాలయమా లేక అడవి ప్రాంతమా అనే రీతిలో మారిందని చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం రైతులకు సేవలందించేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రైతు వేదిక ఇలా చెట్ల చాటున కనబడకుండా పోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత వ్యవసాయ, పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి, అడ్డంగా పెరిగిన కోనోకార్పస్ చెట్ల కొమ్మలను తొలగించి, భవనం స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని రైతులతో పాటు స్థానికులు కోరుతున్నారు.

## కేంద్రం నుండి నిధులు రాబట్టేందుకు యత్నం


వివరాలు మెయిన్‌లో...

## కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ ప్రచార యాత్ర


వివరాలు మెయిన్‌లో...

## కార్మిక చట్ట సవరణలు ప్రమాదకరం


వివరాలు మెయిన్‌లో...

## ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండల ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ మాస సందర్భంగా శాకంబరి అవతారంలో అమ్మ వారిని అలంకరించి ప్రత్యేక పూజలు జరి పించారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు అనంతరం ఆషాఢ మాస విశిష్టతను పురస్క రించుకొని ఆర్యవైశ్య మహిళలు గోరింటాకు కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అశ్విన్, కోశాధికారి నూనె శ్రీనివాస్,సెక్రటరీ శశి ధర్,నూనె ఆంజనేయులు,శ్రీనివాస్, మైలారం నరేష్ ,ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## గోదావరి నదిలో గుర్తుతెలియని మహిళ శవం

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మల్లాపూర్ మండలంలోని ఓబులాపూర్ గ్రామ శివారు లోని గోదావరి నది లో గుర్తుతెలియని మహిళా మృతదేహం లభ్యమైందని ఎస్సై అనిల్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన ప్రకారం బ్లూ రంగు డిజైన్ ఉన్న టాప్ పసుపు రంగు ప్యాంటు, ఆకుపచ్చ రంగు గాజులు కుడి చేతి పై అమ్మ అని టాటు వేసు కున్న గుర్తుతెలియని మృతదేహం లభ్యమైం దని, సమాచారం తెలిస్తే మల్లాపూర్ పోలీస్ స్టేషన్ సంప్రదించాలని సూచించారు.

## గొర్ల కాపరుల సంఘం అధ్యక్షుడికి సన్మానం



**ప్రజాపక్షం / గంగాధర :** గంగాధర మండలం కొండాయపల్లిలో నూతనంగా ఎన్నికైన గొర్ల కాపరుల సహకార సంక్షేమ సంఘం అధ్యక్షులు బొల్ల రాజు, ఉపాధ్య క్షులు మర్రి శ్రీనివాస్, సంఘం సభ్యులను స్థానిక సర్పంచ్ మల్యాల వినయ్ సాగర్ ఘనంగా సన్మానించారు. ఆదివారం గ్రామంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్ర మంలో సర్పంచ్ అధ్యక్షునికి, ఉపాధ్యక్షునికి శాలువా కప్పి సత్కరించారు. ఈ సంద ర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గొర్ల కాప రుల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసి పథకాలు అందేలా చూస్తున్న అధ్యక్షుని సేవలు అభినందనీయమని అన్నారు. గొర్ల పెంపకందారులకు అవసరైన మేత, వైద్య సదుపాయాలు, ఇతర సౌకర్యాల కోసం పంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సంఘం అధ్య క్షుడు మాట్లాడుతూ తన కృషిని గుర్తించిన సర్పంచ్‌కు, గ్రామస్థులకు ధన్యవాదాలు తెలి పారు. రాబోయే రోజుల్లో గొర్ల కాపరులంద రినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చి వారి సమస్య లను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఉప సర్పంచ్ సంఘం సభ్యులు ఎర్రం లచ్చయ్య, తుమ్మల మల్లేశం, ఆవుల కాని మనవ్వ, మైలగాని మహేందర్, పుల్ల రాజవ్వ, పంచాయతీ సభ్యులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ బంధాలకు ప్రతీక రచ్చబండ స్నేహం

**ప్రజాపక్షం/గన్నేరువరం :** గ్రామాల్లో పాతకాలపు స్నే హం స్వార్థం లేనిది, చాలా ప్రేమానురాగాలతో నిండి ఉం డేది. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా నిలుస్తూ చిన్నపాటి సహాయాల నుంచి పెద్ద పనుల వరకు ఊరంతా ఒకే కు టుంబంలా మెలిగేవారు. అమాయకత్వం, స్వచ్ఛత, ఏలాంటి ప్రతిఫలం ఆశించకుండా కల్మషం లేని బంధాన్ని పంచుకు నేవారు. కష్టసుఖాల్లో తోడు ఇంట్లో శుభకార్యం జరిగాన, ఏదానా ఆపద వచ్చినా అర్ధరాత్రి అయినా సరే ముందుగా వచ్చి నిలబడేది స్నేహితులే. కలిసి పంచుకునే ఆనందం, పొలం పనులు, రచ్చబండ ముచ్చట్లు, పండుగలు, ఆటపా టలు, ప్రతి సందర్భాన్ని అందరూ కలిసి వేడుకలా జరుపు కునేవారు. మానసిక ప్రశాంతత ఎంతటి మానసిక ఒత్తిడినై నా స్నేహితులతో కాసేపు మాట్లాడితే మర్చిపోయేంత ఆత్మీ యత వాళ్ల మాటల్లో ఉండేది. పట్టణాల్లో ఆధునిక జీవనశై లి పెరుగుతున్న వేళ, గ్రామీణ ప్రాంతాల్లో ముసలి వయసు లో ప్రతిబింబించే పెద్దల స్నేహం నేటికీ కలుషితం కాని మానవ సంబంధాలకు అద్దం పడుతోంది. గ్రామాల్లోని ర చ్చబండలు, వేపచెట్ల నీడలు కేవలం విశ్రాంతి ప్రదేశాలు మాత్రమే కావు. అవి పెద్దల కష్టసుఖాలు పంచుకునే స్నేహ నిలయాలు. ఉదయాన్నే కలుసుకొని ఊరి విశేషాలు, పాత జ్ఞాపకాలు, వ్యవసాయ ముచ్చట్లతో రోజంతా ఎంతో అ ప్యాయంగా గడిపేవారు. మానసిక ప్రశాంతత, ఒంటరిత నం, వృద్ధాప్య సమస్యలను మర్చిపోవడానికి ఈ స్నేహబం ధం ఎంతో దోహదపడుతుంది. ఊరి వివాదాలను, పంచా యతీలను రచ్చబండ వేదికగానే పెద్దలు తమ అనుభవంతో సులువుగా పరిష్కరించేవారు. తరాలకు ఆదర్శం నేటి యు వతకు విలువలు, ఆప్యాయతలు నేర్పించే పాఠశాలలుగా ఈ పెద్దల స్నేహ బంధాలు నిలుస్తున్నాయి. సాంకేతికత లే కపోయినా కేవలం ప్రేమానురాగాల పునాదుల మీద నిర్మి తమైన ఆనాటి పల్లెటూరి స్నేహాలు నేటి తరానికి ఆదర్శం.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం /రాయికల్ :** స్నేహితుల దినోత్సవం సంద ర్భంగా రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి హైస్కూల్ లో 2000–2001 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆది వారం ఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహిం చారు.25 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకు న్నారు.ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు.గురువులను సన్మానిస్తూ వారి ఆశీస్సులు పొందారు.అనంతరం పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఆటపాటలు,సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలను ఉత్సాహంగా నిర్వహిం చారు.పాఠశాల వ్యవస్థాపకులు, ప్రిన్సిపాల్ మచ్చ గంగా ధర్ మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం తమ వద్ద విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో స్థిరపడటం ఆనం దంగా ఉందన్నారు. ఇన్నేళ్ల తర్వాత కూడా పాఠశాల, గురువులు, స్నేహితులతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసు కుని సిల్వర్ జూబ్లీ నిర్వహించుకోవడం అభినందనీయమ న్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్ రెడ్డి,వేణుగోపాల్, శేఖర్, సురేష్, భూమేశ్వర్,రవీందర్ రావు,భూమయ్య,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి

### పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కుంబాల శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం /రాయికల్ :** పిఆర్‌సి ని వెంటనే ప్రకటించా లని పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కుంబాల శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు,పెన్షనర్ల జీతభ త్యాల సవరణ కోసం తెలంగాణ ప్రభుత్వం 2023 అక్టో బర్ 2 తేదీన రెండవ వేతన సవరణ కమిషన్ ను ఏర్పాటు చేసినప్పటికీ, ఇప్పటివరకు కమిషన్ నివేదికను కూడా బహిర్గతం చేయకుండా జాప్యం చేయడం అత్యంత విచార కరమని అన్నారు. వాస్తవానికి ఉద్యోగులు,ఉపాధ్యా యులు,పెన్షనర్లకు కొత్త వేతన సవరణ 2023 జూలై 1 నుంచే అమల్లోకి రావాల్సి ఉండగా, అలాగే గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత అధికార పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే పీఆర్‌సీని అమలు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిందని,ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడు సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ ఆ హామీ అమలుకు నోచుకోకపోవడం ఉద్యోగ వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేస్తోందన్నారు.రెండవ పీఆర్‌సీ నివేదిక 2024 సంవత్సరంలోనే ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉన్న ప్పటికీ,ఇప్పటివరకు నివేదికను వెల్లడించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు.పెరుగుతున్న ద్రవ్యో ల్బణం,నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయం కార ణంగా ఉద్యోగులు,ఉపాధ్యాయులు,పెన్షనర్లపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు.ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం 51 శాతం ఫిట్‌మెం ట్‌తో వెంటనే రెండవ పీఆర్‌సీని ప్రకటించి అమలు చేయా లని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాయికల్ మండల శాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అంతడుపుల గంగరాజం,రాపర్తి నర్సయ్య,జిల్లా కార్యదర్శి దొంతి సతీష్ లు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణుల పోచమ్మ బోనాల పండుగ




**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో ఆషాఢమాసం బోనాల పండుగ సందర్భంగా పట్టణ విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పొలకల రాజ గణేష్ ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులందరూ గ్రామ దేవత పోలేరమ్మ (పోచమ్మ) తల్లి బోనాలను ఆదివారం భక్తిశ్ర ద్ధలతో ఘనంగా నిర్వహించారు.డప్పు చప్పు లతో మహిళలు నెత్తిన బోనాలతో ఆనం దంతో ఊరేగింపుగా విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకొని ,గ్రామ దేవత పోచమ్మ తల్లిని దర్శించుకుని అమ్మవారికి బోనాలు ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సంద ర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో పాడి పంట పశు సమృద్ధి కోసం గ్రామ దేవత అయిన పోలేరమ్మ తల్లికి ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో బోనాలు సమ ర్పించడం భక్తజనుల ఆచారం ఇందులో భాగంగా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి ప్రజలందరూ ,సుఖ శాంతులతో సుభిక్షంగా ఉండాలని గొల్లపల్లి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ తల్లికి ఘనంగా బోనాలు సమర్పించి అమ్మవారిని ఏడుకు న్నట్లు తెలిపారు.ఈ వేడుకల్లో విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, కమిటీ సభ్యులు,విశ్వబ్రాహ్మణ యూత్ కమిటీ సభ్యులు,విశ్వబ్రాహ్మణ మహిళ సేవా సంఘ సభ్యులు,తది తరులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం /రాయికల్ :** స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆది వారం ప్రగతి హై స్కూల్ 2002 పదో తరగతి బ్యాచ్ స్నేహితుడు తోటి మిత్రుడు మొసరపు శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందిం చారు.ఇటీవల జరిగిన మిత్రుల సమావేశంలో మొసరపు శ్రీనివాస్ అనారోగ్య కారణంగా తన కుమార్తె మొసరపు శ్రీనిధి పదవ తరగతి లో 569 మార్కులు సాధించినప్పటికి విద్య కొనసాగించలేని పరిస్థి తిలో ఉన్నట్లు తెలిసి,సంయుక్త నిర్ణయంతో సంపూర్ణంగా రూ.75,000/ మిత్రుని కుటుంబానికి అందజేశారు . విదేశాల్లో ఉన్న స్నేహితులు మరియు స్థానిక మిత్రులు కేవలం నాలుగు రోజుల్లోనే అవసరమైన నిధులను సమకూర్చి ఈ సహాయాన్ని అంద చేసినట్లు సమాచారం వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సభ్యులు స్నేహితుల ఔదార్యానికి ప్రశంసలు తెలి పారు.శ్రీనిధి భవిష్య త్తులో ఇదే విధంగా నలుగురికి సహాయం అందించి ఉన్నతస్థానంలో ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఇటిక్యాలలో గోరింటాకు వేడుకలు

**ప్రజాపక్షం/రాయికల్ :** మండలంలోని ఇటిక్యాల గ్రామంలో రోజున పద్మశాలి మహిళా సేవా సంఘం ఆధ్వర్యంలో గోరింటాకు వేడుక లను ఆదివారం వైభవంగా జరుపుకున్నారు.పచ్చని గోరింటాకుతో చేతులు అలంకరించుకుని,సంప్రదాయ పాటలతో,చిరునవ్వులతో మహిళలు ఈ వేడుకను కన్నులపండుగగా నిర్వహించారు.ఈ సంద ర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ ఆషాడంలో గోరింటాకు పెట్టుకోవడం మన తెలుగు ఆడబిడ్డల సంప్రదాయమని,ఇలాంటి వేడు కలు అక్కాచెల్లెళ్ల మధ్య అనుబంధాన్ని,ఐక్యతను మరింత బలపరుస్తా యి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షురాలు భోగ అనూష, ఉపాధ్యక్షురాలు మచ్చ లలిత, కోశాధికారి సాంబారి పవిత్ర,కార్యవర్గ సభ్యులు,మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

## మహనీయులు గొప్ప మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

**ప్రజాపక్షం/గొల్లపల్లి:** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రంలో,సామాజిక సేవ కార్యకర్తలు గంగాధర మధుసూదన్ ,సాతల్ల లక్ష్మ ణ్ ,వేల్పుల రాజేష్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వ హిస్తున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నామస్మరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోవింద్‌పల్లి గ్రామ సర్పంచ్ మేక స్వామి పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ,అంబేద్కర్ దేశానికి అందిం చిన అమూల్యమైన సేవలు ,సమానత్వం న్యాయం సామాజిక సంస్క రణలో వారి ఆలోచనలు,ఆశయాలు ఆభవిష్యత్ తరాలు స్ఫూర్తి పొందడంతో పాటు స్మరించుకోవాలని తెలిపారు.అంబేద్కర్ ఎంతో కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగాడని ఆయన ప్రపంచ దేశాలు గర్వించే విధంగా భారత రాజ్యాంగాన్ని రచించిన మహనీ యుడన్నారు. ఆయన గొప్ప మేధావి అని కొనియాడారు.అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆయన కృషి వల్లే అందరికీ రిజర్వేషన్ల రూపంలో సమాన హక్కులు దక్కాయని తెలి పారు. ఇలాంటి అంబేద్కర్ నామస్మరణం కార్యక్రమాన్ని ప్రతి ఆది వారం నిర్వహిస్తూ ప్రజల్లో ఎంతో చైతన్య పరుస్తున్న అంబేద్కర్ నామ స్మరణ కమిటీ సభ్యులను వారు ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో పడాల తిరుపతి,చెన్న జార్ధన్,బికం రాజయ్య,మారంపల్లి రాజకు మార్, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ పట్ల రైతులు జాగ్రత్త

**ప్రజాపక్షం /మానకొండూర్ :** విద్యుత్ పట్ల రైతులు అత్యంత జాగ్రత్త వహించాలని మానకొండూర్ విద్యుత్ శాఖ ఏఈ రాచమల్ల సత్యనారా యణ స్పష్టం చేశారు. విద్యుత్ ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం మానకొండూర్ సెక్షన్ పరిధిలోని పోచంపల్లి సబ్ స్టేషన్‌లో మండలంలోని ప్రజా ప్రతినిధులు, రైతులకు విద్యుత్ పంపిణీ వ్యవస్థ, సబ్ స్టేషన్ యొక్క పనితీరు, సోలార్ విద్యుత్, విద్యుత్ ప్రమాదాలు జరిగే విధానం, వాటి నివారణ గురించి ఏఈ అవగాహన కల్పిం చారు. ప్రతి ఒక్కరూ భద్రతా సూచనలు పాటించాలని విద్యుత్ అధికా రుల సేవలు పొందాలని కోరారు. ఎటువంటి విద్యుత్ సమస్యలకైనా 1912 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, సహకార సంఘాల చైర్మన్లు నాగిశెట్టి రాజయ్య, రొంటాల లక్ష్మారెడ్డి, గంగుల రామ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచులు బుర్ర శ్రీధర్ గౌడ్, అంబటి స్వామి, నాయకులు రేమిడి శ్రీనివాస్ రెడ్డి, వరహాల చారి, జీడీ శ్యాంసుందర్, గుడాల మహేందర్ గౌడ్, ఎడ్ల శ్రీధర్, తోట శ్రీనివాస్, బందెల మహేందర్, రైతులు పాల్గొన్నారు.

# పోచమ్మ గుడి అభివృద్ధికి కృషి చేస్తా

### కార్పొరేటర్ బండారి సుధాకర్

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ కాలనీ వాటర్ ట్యాంక్ ఏరియాలోని పోచమ్మ గుడి అభివృద్ధికి తనవంతు సహకారం అందించి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని 29వ డివిజన్ కార్పొరేటర్ బండారి సుధాకర్ తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పోచమ్మ గుడి అభివృద్ధి కార్యాచరణ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వేల్పుల రవీందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఇసంపెల్లి ప్రభాకర్, మాజీ సర్పంచ్ జక్కుల రాజేశం మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి శ్రీరాంపూర్ కాలనీ, వాటర్ ట్యాంక్ ఏరియాల ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. వేద పండితుడు బుడి అరుణ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు ఆశీర్వచనం అందించారు. వేద పండితులు కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు.

### నూతన కమిటీ ఎన్నిక

పోచమ్మ గుడి అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడిగా కార్పొరేటర్ బండారి సుధాకర్, ముఖ్య సలహాదారులుగా కార్పొరేటర్లు వేల్పుల రవీందర్, వనపర్తి కేత రాజేశ్, మేకల రమేష్, అధ్యక్షుడిగా అర్కాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గడ్డల మధు, నాగుల శంకరయ్య, ప్రధాన కార్యదర్శిగా రాసమల్ల దేవేందర్, కార్యదర్శిగా వేముగంటి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా మూట లక్ష్మ ణ్, కోశాధికారిగా లకావత్ రమేష్, సహాయ కోశాధికారిగా లెక్కపురం రవి, ప్రచార కార్యదర్శిగా వడిజ మహేందర్, మీడియా ఇన్చార్జిగా భాస్కర్ల రాజేశం, సాంస్కృతిక శాఖ అధ్యక్షుడిగా బోగ



మదునయ్య, కార్యదర్శిగా పెద్దపల్లి శంకర్, అధికార ప్రతినిధిగా గుర్రపు సురేష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు కోట గణపతి, మంద సురేష్, బేతు రాయమల్లు, నాగార్జున, జవ్వాడి సాంబయ్య, మాలోత్ రామ్, బూరుగు సత్తయ్య, రణదీప్, మూట రాజశేఖర్, ఆకుల రాంబాబు, అక్కెపెల్లి సాయి, గంగాధర తిరుపతి, బోడ రాజేశ్, పోటు శ్రీనివాసరెడ్డి, వేముగంటి మహేందర్, మామిడాల రాజబాబు, బజ్జూరి లక్ష్మ ణ్, పడాల లింగయ్య, ముద్రకోల సారయ్య, మేకల సతీష్, సంకూరి శ్రీనివాస్, బోగ మనోజ్, మంద భాస్కర్, కవ్వంపెల్లి పోషం పాల్గొన్నారు.

## మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు అన్నారు. కాగజ్ నగర్ పట్టణంలోని సర్ సిల్క్ ఏరియాలో కొలువై ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారికి ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా ఎమ్మెల్యే, వారి కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్ సిల్క్‌లోని నివాసం నుంచి మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల మధ్య బోనం నెత్తిన ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలందరూ పిల్లాపాపలతో ఆనందోత్సాహాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ప్రార్థించారు.ఆలయ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐ ప్రదీప్‌కు సన్మానం



**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు మోడమ్ శంకర్ మరియు అంబకంటి శ్రీనివాస్ సంఘ పెద్దలు నూతనంగా వచ్చిన ఎస్ఐకి అభినందనలు తెలుపుతూ సత్కారం చేశారు.

## ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2010–11 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం సీఎం రావు గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తమకు విద్యా బోధన చేసిన గురువులను పూలమాలలు,శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. 15 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు భావోద్వేగం వ్యక్తం చేశారు. అనంతరం ఆనాటి పాఠశాల జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ,ఒకరి యోగక్షేమాలను మరొకరు అడిగి తెలుసుకున్నారు. మిత్రులందరూ కలిసి పాత అనుభవాలను పంచుకుంటూ ఆత్మీయంగా గడిపారు.ఈ సందర్భంగా ఇటీవల మెట్‌పెల్లి మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యురాలిగా ఎన్నికైన షాద్మా రైస్‌ను, ఖానాపూర్ పట్టణంలో జర్నలిస్టుగా సేవలందిస్తున్న షేక్ పర్వేజ్‌ను తోటి మిత్రులు సత్కరించి అభినందనలు తెలిపారు.అనంతరం



భవిష్యత్తులోనూ ఇలాంటి ఆత్మీయ సమావేశాలను కొనసాగిస్తూ, ఒకరి కష్టసుఖాల్లో మరొకరు పాలుపంచుకుంటూ ఎల్లప్పుడూ కలిసి ఉండాలని పూర్వ విద్యార్థులు సంకల్పించారు.ఈ సమ్మేళనంలో ఉపాధ్యాయులు షౌకత్, జాఫర్, అథర్, నజాం, గౌస్,రవీందర్,లక్ష్మ ణ్,ఉపాధ్యాయినులు తహెనీయత్ జ బీన్,నాజ్రీన్ యాస్మిన్,ఆసియా,షబానాతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా సుదర్శన్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ సుదన్శన్‌రెడ్డి ఆయురోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. మున్సిపల్ చైర్మన్ బోదిరె స్వామి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం సుదర్శన్‌రెడ్డి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, అభిమానులు పాల్గొన్నారు.

## ఎన్నికైన కౌన్సిలర్లకు ఘనంగా సన్మానాలు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లకు బాగులవాడ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.కౌన్సిలర్లు సముందర్ పెల్లి రాజు,ధర్మాజీ రమ్య ఈశ్వర్, మంచాల శ్రీకాంత్ యాదవ్ లను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు శాలువలు కప్పి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు.సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసి వార్డ్ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ప్రజల విశ్వాసానికి అనుగుణంగా సేవలందిస్తామని కౌన్సిలర్లు హామీ ఇచ్చారు.ఈ కార్యక్ర



మంలో మున్నూరు కాపు సంఘ అధ్యక్షులు సముందర్ పల్లి రమేష్,సెక్రటరీ అడప నవీన్,కార్యదర్శులు,తదితరులు,ప్రజా ప్రతినిధులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

### గ్రామ సర్పంచ్ బెండారే కృష్ణాజీ



**ప్రజాపక్షం / వాంకిడి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాల సొంతింటి కల సాకారమవుతోందని గ్రామ సర్పంచ్ బెండారే కృష్ణాజీ తెలిపారు. వాంకిడి మండలంలోని బంబార గ్రామపంచాయతీ పరిధిలో శనివారం గుర్నులే మెంగుబాయి కుటుంబం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటికి స్లాబ్ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ జాడే సంతోష్, కాంగ్రెస్ నాయకులు డికొండ మహేష్ హాజరై ఇంటి యజమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యతతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు ప్రతి పేద కుటుంబం గౌరవప్రదమైన జీవనం గడపాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ మెరుపుదాడి

### ఐదుగురు అదుపులోకి

**ప్రజాపక్షం / కాసిపేట :** సోమగూడెం గ్రామంలోని ఒక ఇంటిలో జూదం ఆడుతున్న ఐదుగురిని నార్కోటిక్ బృందం, టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెంలో నగదు పందెంగా పెట్టి పేకాట నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో అర్ధరాత్రి పోలీసులు మెరుపుదాడి జరిపారు. ఈ దాడిలో రూ.1,10,630 నగదు, 52 పేకముక్కలు, ఐదు మొబైల్ ఫోన్లు, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చట్టపరమైన చర్యల కోసం కాసిపేట పోలీసులకు అప్పగించారు. ప్రజలు తమ పరిసరాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరిగితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు గానీ, టాస్క్ ఫోర్స్ పోలీసులకు గానీ సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



## ఇసుక ట్రాక్టర్ సీజ్

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** డివిజన్‌లోని బట్టాపూర్ గ్రామంలో సుమారుగా 40 ట్రాక్టర్ల వరకు ఇసుక నిల్వలున్నావనే సమాచారమేరకు రెవెన్యూ సిబ్బందితో కలిసి జీపీఓ వెంకటేష్,ఏర్గట్ల ఎస్సై రాజేశ్వర్ సిబ్బదితో కలిసి దాడిచేసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అట్టి నిల్వలను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు.



## కష్టాల్లో ఉన్న మిత్రురాలికి రూ.50 వేల ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన 1999–2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ స్నేహబంధాన్ని మరోసారి చాటుకున్నారు.తమ సహ విద్యార్థిని సంయుక్త భర్త ఇటీవల అకస్మాత్తుగా మృతిచెందడంతో, ఆ కుటుంబానికి అండగా నిలిచేందుకు రూ.50,000 ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, కష్టకాలంలో ఉన్న మిత్రులకు అండగా నిలవడమే నిజమైన స్నేహమని,అది ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అంతేకాకుండా,భవిష్యత్తులో సంయుక్త కుటుంబానికి ఎలాంటి అవసరం వచ్చినా తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని ఆత్మీయంగా భరోసా ఇచ్చారు.



## రాజురలో ఘనంగా ఆరెల్లి మైసమ్మ పండుగ

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని రాజుర గ్రామంలో వి డీసీ మరియు గ్రామస్తులు ఆధ్వర్యంలో ఆరెల్లి మైసమ్మ పండుగ ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి బోనాలు సమర్పించి ఆరెల్లి మైసమ్మకు పూజలు నిర్వహించడం జరిగిందని వర్షాలు సమృద్ధిగా కురవాలని పాడి పంటలు బాగా పండాలని వ్యాపారాలు అభివృద్ధి చెందాలని భగవంతుని ప్రార్థించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ ముత్తా గౌడ్ వైస్ చైర్మన్ నర్సింగ్ రావు,సాయి ప్రసాద్ శ్రీనివాస్,గంగాధర్,షాదుల్ల గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఊర పండగ

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా కేంద్రంలో ఊర పండగ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు తమ మొక్కులుచెల్లించుకున్నారు.

## ఫలాంబరి దేవిగా ఏడుపాయల వనదుర్గమ్మ

**ప్రజాపక్షం/పాపన్నపేట:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని క్షేత్రం ఆషాడమాసం మూడో ఆదివారం భక్తులతో కితకితలు ఆడింది. ఆధ్యాత్మిక వాతావరణం, ఆలయం చుట్టూ పచ్చని చెట్లు, బండ రాళ్లు, గలగల పారే గంగమ్మ పరవళ్ళు, ప్రకృతి ఒడిలో సేదతీరుతున్నామనిపించే అనుభూతి, దేశంలోనే రెండో వనదుర్గామాత ఆలయం, మంజీరా నది ఏడు పాయలుగా చీలి ప్రవహిస్తున్న ప్రాంతం, జనమేజయుని సర్పయాగస్థలిగా వినతికెక్కిన ప్రసిద్ధ పుణ్య క్షేత్రం, ఇవన్నీ పాపన్నపేట మండలం ఏడు పాయల వనదుర్గామాత క్షేత్రం, వనదుర్గా మాతను ఫలాంబరి దేవి రూపంలో విశేషంగా అలంకరించారు. వేకువ జామునే అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి వివిధ రకాల ఫలాలతో అమ్మవారిని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫలాంబరి దేవి రూపంలో అమ్మవారు శోభాయ మానంగా భక్తులను దర్శనమిచ్చారు. వచ్చిన భక్తులు మంజీరా నదీ పాయలు, చెక్ డ్యామ్ లో పుణ్య స్నానాలు ఆచరించి వనదుర్గాదేవి దర్శనం చేసుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి డప్పు చప్పుళ్ళు, మేళ తాళాలతో బోనాలు, ఓడిబియ్యం సమర్పించారు. మరి కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల జయ జయ ద్వానాల మధ్య ఏడుపాయల వనదుర్గాదేవి క్షేత్రం హోరెత్తింది. ఆలయ అర్చకులు పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## వరినాట్లు వేస్తూ ఆదర్శంగా నిలిచిన భీమ్‌గల్ బాలలు



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మేము సైతం అంటూ భీమ్‌గల్ మండల కేంద్రంలో చిన్నారులు వ్యవసాయ పనుల్లో పాల్గొని అందరిని ఆకట్టుకున్నారు. ప్రస్తుత వానకాలం సీజన్ నేపథ్యంలో రైతులు సాగు పనుల్లో బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో భీమ్‌గల్‌కు చెందిన పలువురు చిన్నారులు తమ తల్లిదండ్రులకు తోడుగా నిలవాలని చిన్నారులు భావించారు. బురద అని చూడకుండా ఉత్సాహంగా పొలంలోకి దిగి వరినాట్లు వేశారు. రైతన్న పడే కష్టాన్ని అన్నం విలువను చిన్నతనంలోనే తెలుసుకుంటూ వారు చేసిన ఈ పని స్థానికులను ఎంతగానో ప్రశంసించేలా చేసింది. నేటి డిజిటల్ యుగంలో పిల్లలు మొబైల్ ఫోన్లకు పరిమితమవుతున్న వేళ భీమ్‌గల్ చిన్నారులు ఇలా ప్రకృతితో మమేకమై వ్యవసాయ పనుల్లో పాలుపంచుకోవటం విశేషం. పిల్లల ఉత్సాహాన్ని చూసి వారి తల్లిదండ్రులు కూడా ఎంతో సంతోషం వ్యక్తం చేశారు.

## ఎడపల్లిలో ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఎడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ నాయకులు భారీ కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం జానకంపేట్‌లోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో మండల పార్టీ అధ్యక్షుడు పులి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేజీబీవీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పండ్ల పంపిణీ చేశారు. మంగల్పహాడ్ ఎక్స్ రోడ్డు వద్ద భారీ కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈసందర్భంగా పులి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పేదల పెన్నిది, రైతు బాంధవుడు సుదర్శన్ రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నారాయణ చౌదరి, పోల మల్కారెడ్డి, రజిత యాదవ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఈరంటి లింగం, శంకర్ నాయుడు, బొబ్బిలి శ్రీనివాస్, బంజా కామప్ప, మల్కారెడ్డి, కిషన్ గౌడ్, భాస్కర్ రెడ్డి, ఎల్లయ్య యాదవ్, అమానుల్లా, కాజా, తాహెర్, సంజయ్, ఏజాజ్, జహీర్, కృష్ణ, సూరిబాబు, గంగా ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/బోధన్:** ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలను నిజామాబాద్ జిల్లా బోధన్ మున్సిపల్ పరిధిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయం ఆవరణలో ఆర్డివో విజయ కుమారి, గ్రంథాలయ ఛైర్మన్ అంతిరెడ్డి రాజా రెడ్డి, మున్సిపల్ ఛైర్ పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, ఇతర నాయకుల ఆధ్వర్యంలో గ్రంథాలయ ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం వారు గ్రంథాలయాన్ని సందర్శించారు. లైబ్రరీ హాల్, స్టడీ రూమ్‌లు, భోజన ప్రాంగణం, విశ్రాంతి ప్రాంగణం, కంప్యూటర్ గది, మూత్రశాలలు సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రస్తుతం రానున్న పోటీ పరీక్షల నోటిఫికేషన్ల గురించి వివరించి, బాగా చదువుకొని ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడేలా అడుగులు వేయాలని ప్రోత్సహించారు. అవసరమయ్యే మొదలగు సదుపాయాలను కలెక్టర్, దృష్టికి తీసుకెళ్లి వెంటనే మంజూరు చేసేలా చూస్తామన్నారు. గ్రంథాలయం అభివృద్ధికి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చేసిన కృషిని వారు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శరత్ రెడ్డి, దామోదర్, కాంగ్రెస్ నాయకులు గంగా శంకర్, పాషా, తదితరులు పాల్గొన్నారు.

## బోధన్ పట్టణంలో రక్తదాన శిబిరం



**ప్రజాపక్షం/బోధన్:** బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా 2005 నుంచి ఇప్పటి వరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గత 21 సంవత్సరాలుగా నిరంతరంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దాము, పిసిసి డెలిగేట్ గంగా శంకర్, నాగేశ్వర రావు, మున్సిపల్ ఛైర్మన్ పద్మ శరత్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ చీల శంకర్, వైస్ ఛైర్మన్ వసంత్ రెడ్డి, మందర్న రవి, సిద్ధాపూర్ శరత్, జిల్లా ఉపాధ్యక్షులు పాషా, ఖాజాపూర్ అశోక్, ఎన్ఐసియు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో వన భోజనాల సందడి

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం వనభోజనాలకు వెళ్లారు. ఈ మేరకు బాపునగర్, పోచారం, జైతాపూర్, ఠానాకలాన్, జానకంపేట్ గ్రామాలతో పాటు పలు గ్రామాలలో జనాలు కుటుంబ సమేతంగా గ్రామ శివారులోని గుట్ట ప్రాంతాలకు వెళ్లి కుటుంబ సభ్యులతో సహపంక్తి భోజనాలు చేశారు. వర్షాకాలం ప్రారంభం కాగానే పస్కారాజులకు నైవేద్యాలు సమర్పించి వనాలలో భోజనాలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. జనాలు గ్రామ పొలిమేర్లలో పచ్చిక బయలు మధ్య గడిపేందుకు తమ కుటుంబ సభ్యుల మధ్య పెద్ద ఎత్తున వన భోజనాలకు వెళ్లారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి వనభోజనాలకు వెళ్లే ప్రజలతో గ్రామాల శివార్లు కొత్త కళ సంతరించుకుంది. కుటుంబ సభ్యులతో ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ చాలా సంతోషంగా గడిపారు. మధ్యాహ్నం తేలికపాటి వర్షం కురియడంతో వనభోజనాలకు వెళ్లిన వారికి కొంతమేర ఇబ్బంది కలిగింది.

## ఊర పండుగ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించిన సిపి

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** ప్రజలు పండుగను ప్రశాంతంగా సురక్షితంగా నిర్వహించేందుకు నిజామాబాద్ పోలీస్ శాఖ అన్ని విధాలుగా విస్తృత బందోబస్తు చర్యలు చేపట్టిందని, ప్రజల సహకారంతో పండుగ విజయవంతంగా నిర్వహిస్తామని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. ఆదివారం నిజామాబాద్ నగరంలో ఘనంగా నిర్వహిస్తున్న ఊర పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ట్రాఫిక్ రద్దీని సమర్థవంతంగా నియంత్రించేందుకు చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ పి . సాయి చైతన్య స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పండుగ జరుగుతున్న ప్రధాన ప్రాంతాలు ఊరేగింపు మార్గాలు రద్దీ కూడళ్ళు, ట్రాఫిక్ మళ్ళింపు ప్రాంతాలు, పార్కింగ్ స్తలాలను సందర్శించి పోలీసు అదికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రతి సున్నిత ప్రాంతంలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విదులు నిర్వహించాలని ఆదేశించారు. పండుగ ప్రాంతమంతా సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే ఉన్నతాదికారులకు సమాచారం అందించి తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్, సిసిఆర్‌బి, సిసిఎస్, ఏసిపిలు ప్రకాష్ యాదవ్, గురు నాయుడు, శ్రీశైలం, ట్రాఫిక్ సిఐ ప్రసాద్, టౌన్ సిఐ శ్రీనివాస్ రాజ్, సౌత్ రూరల్ సిఐ, సురేష్ కుమార్ ఎస్‌హెచ్‌వో రఘుపతి, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. నిజామాబాద్ వ్యాప్తంగా ఊర పండుగను ప్రజలంతా భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఊర పండగను నిజామాబాద్ సర్వసమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసం చివర్లో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో దశాబ్దాల కాలంగా వస్తున్న ఊర పండుగ ఆధివారం ఘనంగా నిర్వహించారు. కొత్త దేవతా మూర్తులను ఖిల్లాలో ప్రతిష్టించి సర్వసమాజ్ ఆధ్వర్యంలో ఖిల్లా రఘునాథ ఆలయం వద్ద ఉన్న తేలు మైసమ్మ గుడి వద్ద గ్రామ దేవతలను పసుపు, కుంకుమ, ఆభరణాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మామిడి కర్రలతో తయారుచేసిన 12 దేవతా విగ్రహాలను అర్ధరాత్రి వాటిని ఖిల్లా వద్ద ప్రతిష్టించారు. ఆనవాయితీ ప్రకారం మూడు రోజుల ముందే బాసర గోదావరి నుండి పవిత్ర జలాలు తెచ్చి ఖిల్లా వద్ద గ్రామ దేవతలకు జలాభిషేకం చేయడంతో ఊర పండుగ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు విశేషంగా ఆకర్షించాయి. ఊర పండుగ సందర్భంగా ప్రజలు దేవతా మూర్తుల ఊరేగింపులో ఎదురెళ్ళి కోళ్లను ఎగురవేశారు. ఊరేగింపు జరిగే రోడ్డుపై జంతు బలులుగా మేకలు, గొర్రెలను బలి ఇచ్చారు. ఈ ఊర పండుగను ఎలాంటి కరువు, కాటకాలు లేకుండా వర్షాలు పుష్కలంగా పడాలని, ప్రజలకు ఎలాంటి అరిష్టాలు, అనారోగ్యాలు రాకుండా ఉండాలని అమ్మవార్లను ఊర పండగలో పూజలు చేయడం ఆనవాయితీ, ఈ సందర్భంగా నిర్వాహకులు నగరంలోని ప్రముఖులను, రాజకీయ నాయకులను స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ శాఖ పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేయగా ప్రజలు ఆనందంగా, సంతోషంగా, ఆహ్లాదంగా పండుగను వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ సర్వసమాజ్ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మి నారాయణ, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, నగర మేయర్ కూరగాయల ఉమారాణి, కాంగ్రెస్ నాయకులు నగర అద్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, కేశ వేణు, నరాల రత్నాకర్, బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్, రాగి నారాయణ యాదవ్, ఎండల సుధాకర్, వివిధ సంఘాల నాయకులు, ప్రముఖులు అమ్మవారిని భక్తి శ్రద్దలతో సేవించుకొని నిజామాబాద్ ప్రజలకు ఎలాంటి అరిష్టాలు అనారోగ్యాలు రాకుండా చల్లంగా చూడాలని అమ్మవారికి పూజలు చేశారు.





# సామాజిక న్యాయం తెలంగాణ రక్షణ సేన లక్ష్యం



**ప్రజాపక్షం/గజ్వేల్ :** తెలంగాణలో సామాజిక న్యాయం, అన్ని వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం లక్ష్యంతో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఈ నెల 6న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు, గజ్వేల్ నియోజకవర్గ పార్టీ ఇంచార్జి కొట్టాల యాదగిరి ముదిరాజ్ స్పష్టం చేశారు. ఆదివారం గజ్వేల్ లో సదస్సు పోస్టర్ ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని ఈ సభను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ ఉద్యమం ఆశించిన స్థాయిలో సామాజిక న్యాయం జరగలేదని, సమాజంలోని ప్రతి వర్గానికి, ముఖ్యంగా వెనుక బడిన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సంకల్ప సభతో సామాజిక న్యాయం లక్ష్యంగా ప్రభుత్వానికి ప్రజాభిప్రాయాన్ని బలంగా వినిపించనున్నట్లు తెలిపారు. ప్రొఫసర్ జయశంకర్ ఆకాంక్షించిన సామాజిక తెలంగాణ నిర్మాణమే సభ ప్రధాన లక్ష్యమని చెప్పారు. రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీ వర్గాలకు చెందిన అనేక కులాల వారికి కనీసం గ్రామ సర్పంచ్ స్థాయిలో కూడా రాజకీయ అవకాశాలు లభించడం లేదని, అన్ని సామాజిక వర్గాలకు రాజ్యాధికారంలో సముచిత వాటా కల్పించే దిశగా ఈ సభ వేదిక కానుందని చెప్పారు. రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు, మేధావులు, యువత, సామాజిక సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, కుమార్, వెంకటేష్ , అశోక్, చందు, రాజేష్, కిషన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేయాలి

### సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఉన్నత విద్యను అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇంటిగ్రేటెడ్ పాఠశాలను జగదేవ్‌పూర్‌లో ఏర్పాటు చేయాలని మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం జగదేవ్‌పూర్‌లో మీడియాతో మాట్లాడుతూ జూనియర్ కళాశాల ఏర్పాటుకు మండల శివారులో దాత కేశిరెడ్డి యాదగిరిరెడ్డి విద్యా శాఖకు అప్పగించిన 42 ఎకరాలలో యాంగ్ ఇండియా పాఠశాల నిర్మాణం చేపట్టాలని కోరారు. పాఠశాల నిర్మాణానికి అనువుగా ఉన్న ఆ స్థలంలో పాఠశల ఏర్పాటు చేస్తే సరిహద్దు మూడు జిల్లాల పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగడ పడుతుందని అన్నారు. పాఠశాల నిర్మాణం కోసం ఇప్పటీకే అధికారులు స్థల పరిశీలన చేసినందున పాఠశాల ఏర్పాటుకు జిల్లా విద్యా శాఖ చోరవ చూపాలని పేర్కొన్నారు. పాఠశాల ఏర్పాటుకు వివిద రూపాలలో నిరసన కార్యక్రమాలు చేసి యంగ్ ఇండియా పాఠశాల నిర్మాణం కోసం పార్టీలకు ఆతీతంగా పని చేస్తామని తెలిపారు. అలాగే పాఠశాల సాధన కోసం ఏర్పాటైన కమిటీకి సర్పంచ్‌ల ఫోరం పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బస్వాపూర్ సర్పంచ్ అలేటి కవిత లోలకర్‌రెడ్డి, నిర్మల్ నగర్ సర్పంచ్ పద్మారావులతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## వైభవంగా బోనాల పండుగ



**ప్రజాపక్షం/రేగోడు :** ఆషాడ మాసం సందర్భంగా ఆదివారం రేగోడ్ లో వీర శైవ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో బోనాలు ఘనంగా నిర్వహించారు పోచమ్మ దుర్గమ్మ తల్లి దేవి లకు వైభవంగా బోనాలు సమర్పించారు ప్రతి ఇంటి ఆడపడుచులు పాల్గొన్నారు డప్పుల తో మహిళలు బోనాలు ఆలయాల్లో సమర్పించారు ఈ కార్యక్రమం లో వీరశైవ లింగాయత్ అధ్యక్షులు వీరప్ప సంగప్ప ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

## స్థానిక సంస్థల ఎన్నికలను తలపించిన తజీముల్ మజీద్ కమిటీ పోరు



**ప్రజాపక్షం/గజ్వేల్ :** గజ్వేల్ పట్టణంలోని తంజిముల్ మజీద్ కమిటీ ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికలను తలపించాయి. స్థానిక రాజకీయ నేతల పరోక్ష సహకారంతో ఉత్కంఠభరితంగా సాగిన ఈ ఎన్నికల్లో సయ్యద్ మతీన్ రెండవసారి 286 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆదివారం పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 1,784 మంది ఓటర్లు ఉన్నారు. కాగా వారిలో 1,092 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా, అధ్యక్ష పదవికి పోటీ పడిన ప్రత్యర్థి షేర్ అలీపై సయ్యద్ మతిన్ భారీ మెజారిటీతో గెలుపొందారు. కాగా పోలైన ఓట్లలో షేర్ అలీకి 552 ఓట్లు, సయ్యద్ మతిన్‌కు 838 ఓట్లు పడగా, దీంతో సయ్యద్ మతిన్ 286 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. పరస్పర విమర్శలు, ఆరోపణలతో ప్రచారం సాగడంతో ఈ ఎన్నికలు రసవత్తరంగా సాగాయి. ఓటింగ్ అనంతరం ఫలితాల ప్రకటనతో సయ్యద్ మతిన్ వర్గం సంబరాలు నిర్వహించింది. విజయం అనంతరం నూతన అధ్యక్షుడు సయ్యద్ మతిన్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉంటానని తెలిపారు. మహిళలు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సహకారంతో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి గజ్వేల్ పట్టణ మైనార్టీల సమస్యలను వివరించి, ముస్లింల స్మశానవాటిక ఏర్పాటు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ, ముస్లిం సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల వరకు మాత్రమే విభేదాలు ఉంటాయని, ఇకపై అందరూ కలిసి తంజిముల్ కమిటీ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## నిరుపేద కుటుంబానికి అండగా వంగ రాజేశ్వర్‌రెడ్డి..



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట నియోజకవర్గం చిన్నకోడూర్ మండలం కమ్మర్లపల్లి గ్రామానికి చెందిన వల్లెపు సంపత్‌కు గత ప్రభుత్వ హయంలో ఇల్లు నిర్మాణం మంజూరు కాగా ప్రభుత్వ హామీని నమ్ముకొని అప్పులు చేసి ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించిన కుటుంబం,నిధులు విడుదల కాకపోవడంతో ఆ నిరుపేద కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోంటున్న విషయం ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్‌రెడ్డికి తెలపగా, ఆదివారం వారు బాధిత కుటుంబాన్ని పరామర్శించి,వారి సమస్యలను తెలుసుకొని,అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న ఇంటి నిర్మాణానికి అవసరమైన సహకారం అందించి ఇల్లు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి 5వేల రూపాయలు తక్షణ సహాయంగా అందించారు. అసంపూర్తి ఇంటిలోకి నీరు రాకుండా పైకప్పు కప్పుకునేందుకు టార్పాలిన్ కవర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు ప్రభుత్వాల మార్పుల వలన ఇబ్బందులు పడకూడదని,వారికి ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత ప్రభుత్వాల బాధ్యత అన్నారు. నిరుపేద కుటుంబాల పక్షాన ఎల్లప్పుడూ నేనుంటానని,వారి సమస్యల కొరకు నిరంతరం పోరాడుతానని అన్నారు.

## పోచమ్మ అమ్మవారికి బోనాల సమర్పణ

### ఆరె కులం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు



**ప్రజాపక్షం/కొండపాక :** మండలం లోని అంకిరెడ్డి పల్లి గ్రామంలో ఆషాఢ మాసం సందర్భంగా శ్రీ పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలను అరె కుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం కుల సంఘ సభ్యులు పోచమ్మ అమ్మవారికి బోనాలను సిద్ధం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డప్పు వాయిద్యాల నడుమ శివశక్తుల పూనకాలు, బోనాల ఊరేగింపు గ్రామ ప్రధాన వీధుల గుండా వైభవంగా సాగింది. మహిళలు తలపై బోనాలు మోసుకుంటూ భక్తినినాదాల మధ్య ఆలయానికి చేరుకోవడంతో గ్రామమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పోచమ్మ ఆలయానికి చేరుకున్న అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు, నైవేద్యం, హారతులు నిర్వహించారు. గ్రామ ప్రజల ఆయురారోగ్యాలు, సుభిక్షం, పుష్కలంగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని భక్తులు అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా కుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, ఆషాఢ మాసంలో పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించడం గ్రామంలో తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ అని తెలిపారు. కార్యక్రమంలో కుల సంఘ సభ్యులు, మహిళలు, యువకులు, శివశక్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

## మాంకాల నవీన్‌కు "వాసవి సేవా జ్ఞాన సింధు అవార్డు"



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట పట్టణానికి చెందిన ఆర్య వైశ్య మమాసభ నాయకుడు,వాసవి క్లబ్ సేవాకర్త డాక్టర్ మాంకాల నవీన్‌కుమార్‌కు ఆదివారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో లలిత కళా సమాఖ్య,రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక సంయుక్త ఆధ్వర్యంలో "వాసవి సేవా జ్ఞాన సింధు అవార్డు"ను ప్రదానం చేశారు. ఈ అవార్డును సమాజ సేవ,ఆధ్యాత్మిక సేవ,విద్యాసేవ,వైద్య సహాయం,అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ,ఆర్యవైశ్య అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు "వాసవి సేవా జ్ఞాన సింధు అవార్డు"ను అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ అవార్డు అందించినందుకు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుతూ,అవార్డు బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి మరింత సేవ చేస్తానన్నారు.

## ఉషోదయ యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/కొండపాక :** కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన ఉషోదయ యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా గూడెం శంకర్, ఉపాధ్యక్షుడిగా తూర్పు గున్నాల సత్యం గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కాసాని మహేందర్ రెడ్డి, కోశాధికారిగా గున్నాల కిషోర్ గౌడ్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి సభ్యులు అభినందనలు తెలిపారు. ఎన్నికల పర్యవేక్షకులుగా చిలుముల రవి, అరెపల్లి కరుణాకర్, పెద్ది నాగరాజు వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గూడెం శంకర్ మాట్లాడుతూ, అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో గ్రామ అభివృద్ధిలో అసోసియేషన్ మరింత సమర్థవంతమైన పాత్ర పోషించేలా చొరవ చూపుతానని చెప్పారు. ప్రధాన కార్యదర్శి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామంలోని యువతకు మార్గ నిర్దేశనం చేసేలా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి, అమలు చేస్తామని చెప్పారు.

## మజీద్ కమిటీ చైర్మన్ మతీన్ కు సంపూర్ణ సహకారం అందిస్తా

**ప్రజాపక్షం/గజ్వేల్ :** ప్రతిష్టాత్మకంగా జరిగిన గజ్వేల్ తంజిముల్ మజీద్ కమిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేత సయ్యద్ మతిన్ రెండవసారి విజయం సాధించడం పట్ల గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. విజయోత్సవ ర్యాలీలో పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపిన సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడారు. గజ్వేల్ మైనార్టీల అభ్యున్నతికి శ్రమిస్తున్న మతిన్ కు తన సంపూర్ణ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. గజ్వేల్ పట్టణంలో తన కుడి భుజం, సోదరుడు మతీన్ గెలుపొందడం ఎంతో సంతృప్తి కలిగిస్తుండగా, తన గెలుపుగా భావిస్తున్నట్లు చెప్పారు. అలాగే మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, విజయ మోహన్, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి నాయిని యాదగిరి, నేతలు సమీర్, గుంటకు శ్రీనివాస్, రాములు గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కొండల్ రెడ్డి తదితరులు సయ్యద్ మతీన్ ను అభినందించి సత్కరించారు.